
సాక్షి
ఒడిశా
సోమవారం | 30 | జనవరి | 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6.57.322లు, బంగారం 5 గ్రాములు, వెండి 44.95 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



సంప్రదాయాన్ని కొనసాగిద్దాం

- 8లో

ఘనంగా తిరంగా



బరంపురం: నగరంలోని కళా పరిషత్ ప్రాంగణలో నిర్వహించిన తిరంగా సంస్కృతిక మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో ఆల్ ఇండియా రేడియో డైరెక్టర్ రుశీకేష్ పాణిగ్రహి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మహిళ అనుమానాస్పద మృతి



మాలతి మృతదేహం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ పోలీస్ స్టేషన్ పరిధి రెంగా గ్రామ సమీపంలోయ మహిళ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు రెంగా గ్రామానికి చెందిన మాలతీ జొడియా(32)గా గుర్తించారు. శనివారం ఉదయం వంట కలప కోసం సమీపంలోని అడవిలోకి వెళ్లిన ఆమె.. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త ఖగేశ్వర్ జొడియా ఆందోళన చెందాడు. గ్రామస్తుల సాయంతో చుట్టుపక్కల వెతకగా, ఆదివారం ఉదయం చెట్టుకు వేలాడుతూ మాలతి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని, పోస్టుమార్టం నిమిత్తం రాయగడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఖగేశ్వర్ దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రూ.1432.39 కోట్లతో వార్షిక బడ్జెట్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి జగన్నాథ సరక

పర్లాకిమిడి: పట్టణంలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో జిల్లా స్థాయి ప్రణాళికా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, న్యాయశాఖ మంత్రి జగన్నాథ సరక, ఎంపీ చంద్రశేఖర సాహు, పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, ఉపాధ్యక్షురాలు కుంతలా మల్లిక్, కలెక్టర్ లింగరాజ్ పండా, ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి రమాంచల్ ఖమారి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో వివిధ అభివృద్ధి పథకాలకు రూ.1432.39 కోట్లతో బడ్జెట్ రూపొందించామని జిల్లా ప్రణాళికా కమిటీ అధికారులు తెలియజేశారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, జీవనోపాధి, ఇతర రంగాలకు సంబంధించి ప్రాధాన్య కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీసులకు చిక్కిన గంజాయి రవాణాదారులు



పట్టుబడిన గంజాయితో నిందితులు

జయపురం: సబ్ డివిజన్ బొరిగుమ్మ సమితి బి.సింగపూర్ పోలీసులు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 22.400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కలహండి జిల్లా జయపట్న పోలీసు స్టేషన్ పరిధి బొడొపూజారిగుడకు చెందిన సుభాష్ నాయక్(34), బేణు నాయక్(45)గా తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు బిసింగపూర్ ఏఎస్ఐ సురేంద్రకుమార్ సెఠి ఆధ్వర్యంలో పోలీసులు రాజిగుడ కూడలి వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఆ మార్గంలో బైక్‌పై వస్తున్న వ్యక్తులను అడ్డుకొని పరిశీలించగా, వారి వద్ద ఉన్న బస్తాలో గంజాయి బయట పడింది. నిందితులను అరెస్ట్ చేసి, అదనపు తహసీల్దార్ సంజయకుమార్ సమక్షంలో తూకం వేయించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుందని వెల్లడించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

నెత్తుటి మరక!

- ఆరోగ్యశాఖ మంత్రి నవకిశోర్ దాస్‌పై తుపాకీతో కాల్పులు
- ఘటనా స్థలంలోనే కుప్పకూలిన మంత్రి.. హెలీకాప్టర్‌లో భువనేశ్వర్‌కు తరలింపు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మాజీ గన్‌మెన్, ఏఎస్ఐ గోపాల్‌దాస్ నిందితుడిగా గుర్తింపు
- క్రైంశాఖ దర్యాప్తుకు ఆదేశాలు సీఎం నవీన్ ఆదేశాలు





ఝార్సుగుడ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం మంత్రిని తరలిస్తున్న దృశ్యం

రాష్ట్ర చరిత్రలో నెత్తుటి మరక చోటు చేసుకుంది. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిశోర్ దాస్(61)పై తుపాకీ కాల్పులు జరిగాయి. దీంతో ఘటనా స్థలంలోనే కుప్పకూలిన ఆయనను.. ఝార్సుగుడ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉన్నత చికిత్స కోసం హెలీకాప్టర్‌లో భువనేశ్వర్ తరలించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. మంత్రి మృతికి కారణమైన ఏఎస్ఐ గతంలో ఆయన వద్ద గన్‌మెన్‌గా పని చేసినట్లు ప్రాథమిక సమాచారం. దీనిపై రాష్ట్ర హోంశాఖ దర్యాప్తుకు ఆదేశించింది. – భువనేశ్వర్



ఘటనకు ముందు కార్యకర్తలతో మాట్లాడుతున్న మంత్రి దాస్



ఆరోగ్యశాఖ మంత్రి నవకిషోర్ దాస్(ఫైల్)

ఝార్సుగుడ జిల్లా బ్రజ్‌రాజ్ నగర్ ప్రాంతంలో ఆదివారం నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తుపాకీ కాల్పులకు గురికావడం కలకలం రేపింది. అభిమానులతో కలిసి ఊరేగింపునకు సిద్ధమవుతున్న పరిస్థితుల్లో ఆయనపై తుపాకీ తూటా పేలింది. బ్రజ్‌రాజ్ నగర్ గాంధీ చక్ ఔట్‌పోస్ట్ ఏఎస్ఐ గోపాల్ దాస్ ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. మంత్రి ఛాతికి గురిపెట్టి, తుపాకీ పేల్చడంతో బుల్లెట్ శరీరంలో ఎడమవైపు దూసుకు పోయింది. బ్రజ్‌రాజ్‌నగర్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ కొత్త కార్యాలయ భవనాలను ప్రారంభించేందుకు మంత్రి విచ్చేశారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న హడావిడిలో గాంధీ ఛక్ సమీపంలో తుపాకీ పేలుడు సంభవించింది. గాంధీ చక్ ఔట్‌పోస్ట్ ఠాణా ఏఎస్ఐ తన సర్వీస్ రివాల్వర్‌తో అతి సమీపం నుంచి మంత్రి ఛాతీకి గురిపెట్టి కాల్చడంతో మంత్రి అక్కడికక్కడే కుప్పకూలారు. పక్కనే స్థానిక ఐఐసీ ప్రద్యుమ్న స్వాయినిపై సైతం కాల్పులు జరపగా, ఆయన త్రుటిలో తప్పించుకున్నారు. విషయం తెలుసుకున్న సీఎం నవీన్ పట్నాయక్ ఘటనను తీవ్రంగా ఖండించారు. దీనిపై క్రైంశాఖ దర్యాప్తుకు ఆదేశించారు.

భువనేశ్వర్‌కు ఎయిర్‌లిఫ్ట్..

తుపాకీ కాల్పులకు గురైన రాష్ట్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్‌ను ముందుగా ఝార్సుగుడ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హెలికాప్టర్‌లో భువనేశ్వర్‌కు తరలించారు. మధ్యాహ్నం 2.55 గంటలకు విమానాశ్రయానికి చేరడంతో గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేసి, అంబులెన్స్‌లో హుటాహుటిన అపోలో ఆస్పత్రికి చేర్చారు. క్యాపిటల్ ఆస్పత్రి డైరెక్టర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించగా, ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల బృందం చికిత్సను ప్రత్యక్షంగా పర్యవేక్షించింది. మంత్రి గుండెల్లోకి బుల్లెట్ దూసుకు పోవడంతో ఊపిరితిత్తులు, లోపలి భాగాల పునరుద్ధరణకు చేసిన వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. రక్త ప్రసరణకు చేసిన ప్రయత్నాలు అనుకూలించ లేదు. ఐసీయూలో అత్యవసర చికిత్స సేవలు ఫలప్రదం కానందున ప్రాణాలు కాపాడటం సాధ్యం కాలేదని అపోలో ఆస్పత్రి వర్గాలు మీడియాకు వెల్లడించారు. దీంతో భారీగా అంతర్గత రక్తస్రావమై, ప్రాణాపాయ పరిస్థితులకు దారి తీసినట్లు డాక్టర్ దేవాశిష్ నాయక్ ఆధ్వర్యంలో వైద్య నిపుణుల బృందం వెల్లడించింది.

అత్యంత ధనిక మంత్రిగా..

ఆరోగ్య శాఖామంత్రి నవ కిషోర్ దాస్ నవీన్ మంత్రి మండలిలో రెండో అత్యంత ధనవంతుడు. 2009 నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గానికి నిరవధికంగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయన.. 2019 ఎన్నికల ముందు బీజేడీ చేరి, మరోసారి విజయం సాధించారు. పార్టీలో అనతి కాలంలోనే కీలకమైన వ్యక్తిగా ఎదిగారు. 70కి పైగా వ్యక్తిగత వాహనాలు, రూ.కోటి విలువ చేసే మెర్సిడెజ్ బెంగ్ కారు, ఒక రివాల్వర్, డబుల్ బ్యారెల్ గన్, రైఫిల్ కలిగి ఉన్న కిషోర్‌దాస్ సమగ్ర ఆస్తుల విలువ రూ.34 కోట్లుగా గతేడాది ప్రకటించారు. గనుల మైనింగ్ ఆనయకు ప్రధాన ఆదాయ వనరు.

బలమైన నాయకుడిని కోల్పోయాం..

1962 జనవరి 7న సంబల్‌పూర్‌లో జన్మించిన నవకిషోర్ దాస్.. ఎల్‌ఎల్.బి, ఎంఏ పూర్తి చేశారు. 1980 దశకంలో విద్యార్థి రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. సంబల్‌పూర్‌లోని గంగాధర్ మెహెర్ కళాశాల(ప్రస్తుతం గంగాధర్ మెహెర్ విశ్వ విద్యాలయం)లో చదువుతున్నప్పుడు, విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. దాస్ రాజకీయ ప్రస్థానం సుదీర్ఘంగా 4 దశాబ్దాలు కొనసాగింది. ఉన్నత నాయకత్వ లక్షణాలతో అన్ని వర్గాల ఆదరణ చూరగొన్నారు. క్రియాశీల రాజకీయాల్లోకి తొలుత కాంగ్రెస్ నుంచి, ఆ తర్వాత బిజూ జనతాదళ్ అభ్యర్థిగా శాసన సభ్యుడిగా తుదిశ్వాస వరకు కొనసాగారు. ఆయన మరణంతో పశ్చిమ ఒడిశాతో రాష్ట్రం బలమైన ప్రజా నాయకుడిని కోల్పోయిందని ముఖ్యమంత్రి సంతాపం వ్యక్తం చేశారు. దాస్ ఆకస్మిక మృతి ప్రభుత్వానికి, పార్టీకి తీరని లోటని ప్రకటించారు. ఆరోగ్య మంత్రిగా ఉన్నప్పుడు తీసుకున్న కీలక నిర్ణయాలు వైద్య రంగంలో భారీ సంస్కరణలు చోటు చేసుకున్నాయన్నారు. పశ్చిమ ఒడిశాలో బీజేడీని బలోపేతం చేయడంలో అతని సహకారం అసాధారణమైనదని, పార్టీలకు అతీతంగా అందరి అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు.

గతంలో మంత్రి మహంతిపై..

బిజూ జనతాదళ్ హయాంలో మంత్రులపై దాడులు జరగడం ఇది రెండోసారి. గతంలో 2014 ఫిబ్రవరి 21న న్యాయశాఖ మంత్రి మహేశ్వర్ మహంతిపై తుపాకీ దాడి జరిగింది. ఈ ఘటన పూరీలో చోటు చేసుకుంది. మంత్రి శరీరంలోకి రెండు తూటాలు దూసుకుపోయాయి. అదృష్టావశాతు ఈ దాడి నుంచి మంత్రి ప్రాణాలతో బయటపడ్డాడు. తాజాగా మంత్రి నవకిషోర్ దాస్ తుపాకీ పేలుడుతో మృతిచెందడం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. 2009 నుంచి ఆయన ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

సీఎం రాజీనామా చేయాలి: కాంగ్రెస్

మంత్రి కిషోర్‌దాస్‌పై తుపాకీ దాడి తదనంతర మృత్యు ఘటన పట్ల రాష్ట్ర కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. దీనిపై బాధ్యత వహిస్తూ సీఎం నవీన్ పట్నాయక్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కంటాబంజి ఎమ్మెల్యే సంతోష్‌సింగ్ సలుజా పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఆరోగ్య మంత్రిపై కాల్పులపట్ల ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఈ దారుణమైన ఉదంతాన్ని తీవ్రంగా ఖండిస్తోందని, అయితే ఈ విషాద ఘటన రాష్ట్ర ప్రజల భద్రత వ్యవస్థ పట్ల ప్రశ్న లేవనెత్తిందని నిలదీశారు. ప్రభుత్వం తన మంత్రికి భద్రత కల్పించ లేకపోతే, సామాన్యుల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి పరాకాష్ట అని, దీనిని ప్రభుత్వం ఎలా సమర్థిస్తుందని ప్రశ్నించారు. 'ముఖ్యమంత్రి స్వయంగా హోంశాఖను నిర్వహిస్తున్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని మీడియా వింగ్ చైర్మన్ గణేశ్వర్ బెహెరా, జట్నీ నియోజక వర్గం ఎమ్మెల్యే సురేష్‌కుమార్ రౌత్రాయ్ డిమాండ్ చేశారు.

ఆస్పత్రికి చేరుకున్న సీఎం

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మంత్రిని చికిత్స నిమిత్తం తరలించిన భువనేశ్వర్ అపోలో ఆస్పత్రిని ప్రత్యక్షంగా సందర్శించారు. వైద్య వర్గాలతో సంప్రదించి, మంత్రి ఆరోగ్య స్థితగతులతో చికిత్స, వైద్య వ్యవస్థ వివరాలను తెలుసుకున్నారు. కిషోర్ భార్య మినతి, కుమారుడు విశాల్‌ను ఓదర్చారు. ప్రణబ్ ప్రకాష్ దాస్, దేవి మిశ్రా, సుశాంత్ సింగ్, స్నేహాంగిని ఛురియా సహా పలువురు బిజూ జనతాదళ్ నేతలు అపోలో ఆస్పత్రికి చేరుకున్నారు.



మంత్రి నవకిశోర్ దాస్ భార్య మినతి, కుమారుడు విశాల్‌ను ఓదార్చుతున్న సీఎం నవీన్ పట్నాయక్

మానసిక సమస్యలకు మందులు వాడుతున్నారు..

మంత్రి దాస్‌పై తుపాకీ కాల్పుల ఘటనలో ప్రధాన నిందితుడు ఏఎస్ఐ గోపాల్‌కృష్ణ దాస్ గత కొన్నేళ్లుగా మానసిక సమస్యలతో బాధపడుతున్నారని ఆయన భార్య జయంతి దాస్ తెలిపారు. మంత్రిపై దాడికి సంబంధించిన సమాచారం టీవీ చానెళ్ల ప్రసారంతో తెలిసిందన్నారు. 'నా భర్త గత ఏడాదిన్నరగా గాంధీ ఛక్ ఔటుపోస్టులో ఉద్యోగం చేస్తున్నారు. అనారోగ్యానికి సంబంధించి మందులు కూడా వాడుతున్నారు. అయితే అతను ఈ చర్యకు ఎందుకు పాల్పడ్డారో తెలియదు. ఉదయమే కుమార్తెతో, శనివారం రాత్రి కుమారుడితో వీడియోకాల్ ద్వారా మాట్లాడారు. కాల్ సమయంలో పూర్తిగా సాధారణమైనట్లు కనిపించా'రని ఆమె వివరించారు. ఈ చర్యతో తామంతా షాక్‌కు గురయ్యామన్నారు. నిందిత దాస్‌ను ఝార్సుగూడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. క్రైంబ్రాంచ్ దర్యాప్తు చేస్తోందని ఉత్తర రేంజ్ ఐజీ దీపక్‌కుమార్ ప్రకటించారు. ఆయన వినియోగించిన తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.



జయంతి దాస్, ఏఎస్ఐ గోపాల్‌దాస్ భార్య

కొనసాగుతున్న విచారణ..



నిందితుడు ఏఎస్ఐ గోపాలదాస్

నిందిత ఏఎస్ఐ గోపాల్‌దాస్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు బ్రజరాజ్ నగర్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్(ఎస్‌డీపీఓ) గుప్తేశ్వర్ భొయ్ తెలిపారు. నిందితుడు గాంధీ ఛక్ పోలీస్ అవుట్‌పోస్ట్ సిబ్బందిగా పేర్కొన్నారు. తన సర్వీస్ రివాల్వర్‌తో 2 రౌండ్లు కాల్పులు జరిపగా.. ఈ పరిస్థితికి ప్రేరేపించిన కారణాలను ధ్రువీకరించే దిశలో విచారణ కొనసాగుతోందని వెల్లడించారు. గంజాం జిల్లా బరంపురం అంకులి ప్రాంతానికి చెందిన ఏఎస్ఐ కొన్నేళ్ల క్రితం మంత్రి వ్యక్తిగత భద్రతా అధికారి(పీఎస్ఓ)గా పనిచేశాడని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ప్రధాని, గవర్నర్ల సంతాపం..

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్ దాస్ మృతిపట్ల భారత ప్రధాని నరేంద్రమోదీ సంతాపం వ్యక్తం చేశారు. కాల్పులకు గురికావడం బాధాకరమన్నారు. అలాగే రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీలాల్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందని తెలిపారు. అలాగే పార్టీలకు అతీతంగా వివిధ రాజకీయ ప్రముఖులు మంత్రి మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

అరుణ్ బొత్రా నేతృత్వంలో..

బ్రజ్‌రాజ్‌నగర్‌లో మంత్రి కిషోర్‌దాస్‌పై ఏఎస్ఐ కాల్పులు జరపడంతో మృతికి దారితీసిన ఘటనపై విచారణ జరిపేందుకు ఒడిశా క్రైంబ్రాంచ్ బృందం ఆదివారం సాయంత్రం ఝార్సుగుడ చేరుకుంది. ఎస్పీ రమేష్‌చంద్ర దొర ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ బృందంలో బాలిస్టిక్, సైబర్ నిపుణులు, క్రైంబ్రాంచ్ అధికారులు ఉన్నారు. దర్యాప్తును క్రైంశాఖ సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ అరుణ్ బొత్రా విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. కాల్పులకు గల కారణాన్ని తెలుసుకోవడానికి, ఘటన జరిగిన వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకున్న ఏఎస్ఐను విచారించనున్నారు.



ఘటనా స్థలంలో నిందితుడు గోపాల్‌దాస్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

నిందితులకు నోటీసులు

మల్కన్‌గిరి:

జిల్లాలోని మల్కన్‌గిరి సమితి పద్మాగిరి పంచాయతీ ఎంవీ 83 గ్రామానికి చెందిన నితాయి మండాల్, అశోక్ మహారి, మహేంద్ర బాసు గత కొంతకాలంగా గంజాయి రవాణా చేస్తున్నారు. దీనిపై పోలీసులు ఎన్నిసార్లు మందలించినా పెడచెవిన పెడుతున్నారు. కోర్టు నోటీసులకు సైతం స్పందించడం లేదు. దీంతో వారి స్వగ్రామానికి పోలీసులే స్వయంగా వెళ్లారు. మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండో ఆధ్వర్యంలో సిబ్బంది నిందితుల ఇళ్ల వద్ద నోటీసులు అంటించారు. ఇప్పటికైనా కోర్టుకి రానిపక్షంలో ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు.



మైక్‌లో నోటీసు చదివి వినిపిస్తున్న ఐఐసీ రీగాన్ కీండో

సందడిగా మినీ మారథాన్

రాయగడ: కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండ్రస్ట్రీయల్ అండ్ టెక్నాలజీ(కేఐఐటీ) విద్యాసంస్థ సిల్వర్ జూబ్లీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మినీ మారథాన్ నిర్వహించారు. పట్టణంలోని సిరగుడ నుంచి భారిజోల వద్ద ఉన్న ఐఏసీఆర్ కళాశాల ఈ పరుగు కొనసాగింది. జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ముఖ్య అతిథిగా, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతీ మాఝి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. అందరికీ చదువు అనే నినాదంతో నిర్వహించిన ఈ చైతన్య ర్యాలిలో విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 2 కిలోమీటర్ల మేర కొనసాగిన ఈ ర్యాలీలో రాజాన ధోని ప్రథమ, రాజాకుమార్ నాయక్ ద్వితీయ, ఎడగల సూరజ్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు ఎస్పీ శర్మ బహుమతులు అందజేశారు. విద్యతోనే ప్రగతి సాధించగలమని ఆయన హితవు పలికారు.



మినీ మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

ఎంతోమంది ఆదివాసీ విద్యార్థులకు ఆసాదీపంగా నిలుస్తున్న కిట్ గ్రూప్ సంస్థలు ఆదర్శనంగా నిలుస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే ముదలి మాట్లాడుతూ భువనేశ్వర్‌లోని ఈ విద్యాసంస్థలు పేదలపాలిట వరంగా మారాయని తెలిపారు. ఆదివాసీ విద్యార్థులకు ఉచితంగా చదువు, వసతి సౌకర్యాలు కల్పిస్తున్న సంస్థల అధినేత అచ్యుత్ సామంత సేవలు ప్రసంశనీయమన్నారు. కళింగ టీవీ రాయగడ బ్యూరో హెడ్ అమూల్యరత్న సాహు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు హరప్రసాద్ హెప్రుక పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న కుక్కల దాడిలో గాయపడిన బాధితులు

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో వీధి కుక్కలు గ్రామస్తులపై దాడి చేయడంతో ముగ్గురు తీవ్ర గాయాల పాలు కాగా మరి కొంతమందికి స్వల్పంగా గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గోగాడ సతీష్, పేకేటి పైడిరాజు, పాశల అచ్చియ్యమ్మలు తీవ్రంగా గాయపడడంతో వారిని గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. స్వల్పంగా గాయపడిన వారు స్థానికంగా చికిత్స పొందారు.

ఆటోలోంచి జారిపడి వ్యక్తి మృతి



చిన్నకృష్ణ మృతదేహం

శృంగవరపుకోట: ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన అల్లు చిన్నకృష్ణ(52) ఆటోలో ప్రయాణిస్తుండగా జారిపడి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి ఎస్సై జె.తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.కోటలో ఓ ఫంక్షన్‌కు హాజరైన చిన్నకృష్ణ తిరిగి ధర్మవరం వెళ్తుండగా మారుతీనగర్ వద్ద ప్లేవుడ్ పరిశ్రమ ఎదురుగా ఆటోలో నుంచి జారిపడి గాయాలపాలయ్యాడు. స్థానికులు హుటాహుటిన ఎస్‌కోట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యాధికారి నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు

బొబ్బిలి: మండలంలోని పారాది సమీపంలో మలుపు వద్ద ఆదివారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన బండి రమేష్‌ను అదే జిల్లా పాచిపెంట మండలం మోసూరుకు చెందిన లండా సింహాచలాన్ని ద్విచక్రవాహనంపై దిగబెడుతుండగా బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరూ కింద పడి తీవ్రగాయాలపాలయ్యారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏఎస్సై జి.భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

వాటర్ ట్యాంకుపైనుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య



వీర నారాయణస్వామి మృతదేహం

బొండపల్లి: మద్యం తాగి ఆరోగ్యం పాడు చేసుకోవద్దని నచ్చచెప్పాలని ప్రయత్నించిన భార్య మాటలు భర్తను మనస్తాపానికి గురి చేశాయి. దీంతో వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బొండపల్లి మండలంలోని గొల్లుపాలెంలో ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం, కైకరం గ్రామానికి చెందిన దార్ల వీర నారాయణస్వామి (37) బతుకు దెరువు కోసం గొల్లుపాలెం గ్రామానికి వచ్చి కార్పెంటర్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆరు నెలల క్రితం స్వగ్రామానికి వెళ్లి అక్కడ పనులు చేస్తూ వ్యసనాలకు బానిసయ్యాడు. తిరిగి గొల్లుపాలెం వచ్చిన నారాయణ స్వామి ఇక్కడ పని చేయకుండా మద్యం తాగుతూ కాలక్షేపం చేస్తున్నాడు. మద్యం తాగవద్దని రెండు రోజుల క్రితం భార్య చెప్పడంతో మనస్తాపానికి గురై గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద గల వాటర్ ట్యాంకు పైకి ఎక్కి దూకేశాడు. పై నుంచి దూకడంతో తీవ్ర గాయాల పాలైన నారాయణ స్వామిని గజపతినగరంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతునికి భార్యతో పాటు 12 ఏళ్లు, 8 ఏళ్ల వయస్సు ఉన్న ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఎస్సై రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కమ్మసిగడాం జాతర

చీపురుపల్లి రూరల్: శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం కమ్మసిగడాం జాతర మహోత్సవా లు సోమవారం ప్రారంభమై మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న ఈ జాతర మహోత్సవాల్లో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తజనాన్ని అలరించనున్నాయి.

బిత్రపాడులో గజరాజుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు పంట పొలాల్లో ఏడు గజరాజులు సంచరిస్తున్నాయి. ఆదివారం ఉదయం ఏనుగుల గుంపు రావడంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ప్రస్తుతం అరటి, కూరగాయల పంట చేతికందిన సమయంలో గజరాజులు రావడంతో ఎక్కువగా నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంప్రదాయాన్ని కొనసాగిద్దాం

- గుణుపూర్ ఎమ్మెల్యే గమాంగో

రాయగడ: ఏటా వంశధార వసంతోత్సవాల పేరిట నిర్వహిస్తున్న ఉత్సవాలను సంప్రదాయంగా కొనసాగిద్దామని, దీనికి అందరి సహకారం అవసరమని గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగో కోరారు. జిల్లాలోని గుణుపూర్‌లో శనివారం నుంచి నిర్వహిస్తున్న వసంతోత్సవాల్లో భాగంగా కపిల్‌పూర్ వేదిక్రపై నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల భాష, సంస్కృతికి అద్దం పట్టే ఈ ఉత్సవాలను వంశధార పేరిట నిర్వహిస్తుండటం ఆదివాసీలు, వారి ఆత్మాభిమానాన్ని గౌరవించినట్టేనని తెలిపారు. గుణుపూర్‌లో అత్యధిక శాతం మంది నివసించే లంజియా సవరలు ఒకప్పుడు అభివృద్ధికి ఆమడ దూరం ఉండేవారన్నారు. వారి ఆర్థిక, సామాజిక రంగాల ఉన్నతికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. వారి సంప్రదాయాలను పరిరక్షించే విధంగా ఇటువంటి ఉత్సవాలు ఎంతగానో దోహదపడుతున్నాయని వివరించారు. అదేవిధంగా వారిలో కళా నైపుణ్యతను వెలుగులోకి తీసుకు రావడంతో పాటు తగిన ప్రోత్సాహం కూడా ఇస్తుండటం అభినందనీయమన్నారు. శనివారం నిర్వహించిన కలశయాత్రలో వేలాదిమంది ప్రజలు పాల్గొనడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు.



సంబల్‌పూర్ వస్త్రాధారణలో యువతులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రముఖ పాత్రికేయుడు మిలి పాఢి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, అయితే ఈసారి ప్రజల నుంచి భారీగా స్పందన లభించడం ఆనందకర విషయమన్నారు. అలాగే గుణుపూర్ సమితి అధ్యక్షురాలు ఝిలి సాబోరా తదితరులు ప్రసంగించారు. వసంతోత్సవాల్లో భాగంగా వేదిక్రపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఒడిశా ప్రసిద్ధ సంబల్‌పూర్ వస్త్రాలంకరణలో యువతులు చేసిన నృత్యాలు అందరినీ రంజింపజేశాయి. అదేవిధంగా ఆదివాసీ నృత్యాలు అలరించాయి. అనంతరం కళాకారులను అతిథుల చేతుల మీదుగా సత్కరించారు.



వేదికపై ఎమ్మెల్యే గమాంగో, ఝిలి సాబోరా, మిలి పాఢి



కళాకారులను సత్కరిస్తున్న నిర్వహకులు

యువకుడి మృతితో ఉద్రిక్తం

- ఆస్పత్రి, పోలీస్ స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన



పోలీస్‌స్టేషన్‌వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

పాలకొండ: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హైడ్రామా నడిచింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నగరపంచాయతీకి చెందిన వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని కొండవీధికి చెదిన శ్రావణ్ కుమార్ మృతిచెందిన విషయం తెలిసిందే. శనివారం రాత్రి స్థానిక ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించి ఆదివారం ఉదయం పోస్టుమార్టం కోసం పోలీసులు ఏర్పాట్లు చేశారు. దీనికి మృతుని కుటుంబసభ్యులు అంగీకరించలేదు. తమకు న్యాయం చేసే వరకు పోస్టు మార్టం చేయవద్దని ఆందోళనకు దిగి మృతుని కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. దీనికి కమిషనర్ అంగీకరించకపోవడంతో మధ్యాహ్నం వరకు ఆస్పత్రి వద్ద ఆందోళన కొనసాగింది. ఈ నేపథ్యంలో కమిషనర్ సర్వేశ్వరరావుతో డీఎస్పీ కృష్ణారావు మాట్లాడి మృతుని కుటుంబసభ్యుల్లో ఒకరికి తాత్కాలిక పద్ధతిలో ఉద్యోగం కల్పించేందుకు అంగీకరింప చేశారు. అనంతరం మృతుని భార్య తరపువారు, తల్లి తరపు వారి మధ్య వివాదం రేగింది. ఉద్యోగంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం తమకు కావాలంటే, తమకు కావాలని పట్టుబట్టి వాదోపవాదాలకు దిగారు. ఆస్పత్రి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని అక్కడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఎస్సై శివప్రసాద్‌తో పాటు పోలీసులు ఎంత సర్ది చెప్పినా ఆందోళన విరమించలేదు. దీంతో డీఎస్పీ కృష్ణారావు చొరవ తీసుకు,ని ఇరువర్గాల వారికి నచ్చజెప్పి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. సాయంత్రం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

నేడు మరియగిరి యాత్ర

- సహాయమాత ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యేక సర్వీసులు నడవనున్న ఆర్టీసీ

వీరఘట్టం: వీరఘట్టంకు సమీపంలో యు.వెంకమ్మపేట వద్ద మరియగిరి కొండపై వెలసిన శ్రీకాకుళం మేత్రాసన పాలక పునీతురాలు, క్రైస్తవుల సహాయమాత మరియమ్మ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. ప్రతీ ఏటా జనవరి 30న మరియగిరి యాత్ర ఆనవాయితీగా జరుగుతోంది. కుల, మతాలకు అతీతంగా భక్తులు వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. గత రెండేళ్లుగా కరోనా ప్రభావంతో భక్తుల తాకిడి తగ్గింది. అందుచే ఈ ఏడాది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున గతంలో కంటే వైభవంగా మహోత్సవాన్ని జరిపేందుకు మరియగిరి ఉత్సవ కమిటీ ఫాదర్ చల్లా డేవిడ్ ఏర్పాట్లు చేశారు. భక్తులు మరియమ్మను దర్శించుకొనేందుకు వీలుగా కొండపైన క్యూలైన్లు ఏర్పాటు చేశారు. కొండ దిగువన శ్రీకాకుళం మేత్రాసనం పీఠాధిపతి రాయిరాల విజయకుమార్ ఆధ్వర్యంలో జరగనున్న దివ్య పూజకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక టెంట్‌లు, షామియానాలు ఏర్పాటు చేసారు. యాత్రా ప్రాంగణంలో ప్రత్యేక స్టాళ్లు పెట్టారు.

30 ఏళ్లుగా...

పూర్వకాలం నుంచి మరియగిరి యాత్ర ఇక్కడ జరిగేది. గత 30 ఏళ్లు నుంచి శ్రీకాకుళం మేత్రాసనం ఆధ్వర్యంలో మరియగిరి యాత్ర జరుగుతోంది. ఈ ఏడాది మరియగిరి యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి పలు చర్చిల ఫాదర్‌లు, మఠకన్యలు హాజరై ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

70 మంది పోలీస్ సిబ్బంది

మరియగిరి యాత్రకు పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో 70 మంది పోలీస్ సిబ్బంది నియమిస్తున్నట్లు సీఐ మురళీధర్ తెలిపారు. వీరఘట్టం ఎస్ఐ ఎం.హరికృష్ణ ఆదివారం మరియగిరి ప్రాంగణాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు బృందాలను నియమించారు. వాహనదారులు, ముఖ్యంగా ఆటోలు నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.



భక్తుల పూజలందుకుంటున్న మేరీమాత

పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలుపుదల చేయాలని కోరారు.

ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

మరియగిరి యాత్రకు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలి రానున్నారు. వీరి కోసం పార్వతీపురం, పాలకొండ, శ్రీకాకుళం ఆర్టీసి డిపోల నుంచి ప్రతి 15 నిమిషాలకు మరియగిరి స్పెషల్ బస్సులు నడపనున్నట్లు ఆయా డిపోల మేనేజర్లు తెలిపారు. సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మరియగిరి వద్ద ప్రత్యేక ఆర్టీసీ కంట్రోల్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

సాయి సంస్థలకు రూ.లక్ష విరాళం



విరాళం చెక్కును అందిస్తున్న తెన్నేటి పార్వతి

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా గల సత్యసాయి సేవా సమితి మందిర అభివృద్ధికి పాలకొండకు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయురాలు ముక్కవెల్లి తెన్నేటి పార్వతి రూ.1లక్ష విరాళంగా ఆదివారం అందజేశారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర సమన్వయకర్త ఆర్.కిశోర్, కన్వీనర్ కర్రా సుధాకరరావులకు విరాళం చెక్కును అందించారు. ఇప్పటికే దాత, విశ్రాంతి ఉపాధ్యాయురాలు సాయి మందిరం ద్వారా నిర్వహిస్తున్న నిత్యాన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలకు రూ.పది లక్షలు విరాళాలు విడతల వారిగా అందించారని తెలిపారు. కార్యక్రమంలో పేడ్డ రాంబాబు, కె.స్వరాజ్యం, సీహెచ్.శ్రీనివాస్, గేదెల శ్రీరాములు పాల్గొన్నారు.

గరివిడిలో తైక్వాండో పోటీలు



పోటీల్లో విజేతలుగా నిలిచిన గోదావరి దేవి షరాఫ్ పాఠశాల విద్యార్థులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడిలోని గోదావరిదేవి షరాఫ్ ఉన్నత పాఠశాలలో 15వ జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు ఆదివారం ఘనంగా జరిగాయి. జిల్లా తైక్వాండో సెక్రటరీ సీహెచ్.వేణుగోపాలరావు, శ్రీకాకుళం జిల్లా కోచ్ భాస్కరరావుల ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 15 క్లబ్బుల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జూనియర్, క్యాడెట్, గోదావరిదేవి షరాఫ్ స్కూల్‌కు చెందిన ఎం.ఇషిత, ఎ.శ్రీచందన, ఎం.ప్రశాంతి, డి.నిశికీర్తన బంగారు పతకాలు, మరో ఆరుగురు విద్యార్థులు సిల్వర్, 20మంది కాంస్య పతకాలు గెలుచుకున్నరు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులను రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు పంపిస్తామని ఈ సందర్భంగా తైక్వాండో సెక్రటరీ వేణుగోపాలరావు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాం విద్యాపీఠ్ ప్రతినిధులు టి.కమలాకరరావు, బి.రవి, మజ్జి భాస్కరరావు, జయ తదితరులు పాల్గొన్నారు.



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా సెక్రటరీ, స్కూల్ యాజమాన్యం

రసవత్తరంగా అవధాన వాణీవిలాసం



అవధాన వాణీవిలాసం నిర్వహిస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక గాయత్రి భవన్‌లో ఆదివారం సాయంత్రం తిరుపతికి చెందిన అవధాన బాల భాస్కర శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ నేతృత్వంలో అవధాన వాణీ విలాసం పేరుతో నిర్వహించిన అష్టావధానం ఆద్యంతం రసవత్తరంగా సాగింది. ప్రాశ్నిక పరిషత్‌లో చంధోభాషణాన్ని బెంగళూరుకు చెందిన భైరవభట్ల కామేశ్వరరావు, నిషిద్ధాక్షరిని డాక్టర్ భైరవభట్ల విజయాదిత్య, దత్తపదిని పార్వతీపురానికి చెందిన డాక్టర్ ఎస్.హరిచందన్, వర్ణనను డాక్టర్ పి.శిరీషా రఘురామ్‌లు నిర్వహించగా, న్యస్తాక్షరిని దశగ్రంథాల సుబ్రహ్మణ్యం, అశువును డాక్టర్ జక్కు రామకృష్ణ, అప్రస్తుత ప్రసంగాన్ని బీహెచ్‌కే.బాబూజీలు ప్రసంగించారు. కార్యక్రమానికి విజయభావన అధ్యక్షుడు దేవరాజు గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రామనారాయణం ట్రస్టీ నారాయణం శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. విజయభావన ప్రధానకార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు సభా సంచాలకుడిగా వ్యవహరించారు.



సరికొత్తగా దర్శనమిస్తున్న కాటేజీ



తాటిపూడి జలాశయం

అందం చూడవయా..

ఆనందించవయా..!

- తాటిపూడి కాటేజీకి కొత్త హంగులు
- అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ప్రభుత్వం
- పర్యాటకులు ఉండేలా ఏసీ .నాన్ ఏసీ గదుల ఆధునికీకరణ
- అందమైన పెయింటింగ్ ఏర్పాటు



కాటేజీ అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు



కాటేజీ వద్ద ఏర్పాటు చేసిన పెయింటింగ్

గంట్యాడ: తాటిపూడి కాటేజీ కొంత హంగులతో దర్శనమిస్తోంది. కాటేజీ ప్రాంతాన్ని ప్రభుత్వం అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. పర్యాటకులను ఆకర్షించేవిధంగా ఆధునీకీకరించారు. పచ్చని కొండలు, అ కొండల నడుమ నిండుకుండలాంటి జలాశయంతో తాటిపూడి కాటేజీ ప్రాంతం అత్యంత ఆహ్లాదకరంగా, ప్రశాంతమైన వాతావరణంలో పర్యాటకులను ఆకర్షిస్తోంది.

ఆధునికీకరించిన ప్రభుత్వం

తాటిపూడి అందాలను చూడడానికి వచ్చే పర్యాటకులు కాటేజీలో ఒకటి రెండు రోజులు ఉంటారు. ప్రస్తుతం ప్రభుత్వం గదులను, కాటేజీ ప్రాంతాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. పర్యాటకులు ఉండే గదులతో పాటు పరిసర ప్రాంతాన్ని ఆధునీకరించారు. అలాగే పర్యాటకులను ఆకర్షించేందుకు అందమైన పెయింటింగ్‌లు, విగ్రహాలను ఏర్పాటు చేశారు. పర్యాటకులు కూర్చుని వీక్షించేప్రాంతాన్ని టైల్స్‌తో ఆధునీకరించారు.

అందుబాటులో: అన్ని రకాల ఫుడ్ ఐటమ్స్

తాటిపూడి పర్యాటక ప్రాంతాన్ని వీక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ తోపాటు, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. అన్ని ప్రాంతాల పర్యాటలకులకు అనువుగా ఉండే ఫుడ్ ఐటమ్స్‌ను అందుబాటులో ఉంచారు. అదేవిధంగా తాటిపూడి చేపల కూర ఇక్కడి ప్రత్యేకత. కాటేజీ ప్రాంతం అందంగా దర్శన మిస్తుండడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

రుచికరమైన వంటలు



కాటేజీ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. పర్యాటకులను ఆకర్షించేందుకు పెయింటింగ్స్, విగ్రహాలు ఏర్పాటు చేశా. సొంతచెఫ్‌తో పర్యాటకులకు రుచికరమైన వంటలను అందిస్తున్నాం. కాటేజీ ప్రాంతానికి వచ్చే రహదారి కూడా బాగు చేయించాం. పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు.

– చుక్క శేషు, గిరివినాయక ఈకో టూరిజం మేనేజర్

గడ్డికుప్పలు దగ్ధం



అల్లువాడలో దగ్ధమవుతున్న వరిగడ్డి కుప్ప

జియ్యమ్మవలస: మండలంలోని అల్లువాడ గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో రైతుల గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా గడ్డి కుప్పల నుంచి మంటలు రావడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వారంతా వచ్చేలోగానే పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే గడ్డి కుప్పల పక్కనే ఉన్న ధాన్యం కుప్పలకు మంటలు అంటుకోకుండా రైతులంతా కలిసి మంటలను అదుపు చేశారు. సర్పంచ్ బొంగు పరిశినాయుడు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చేలోపల 60 ఎకరాల వరిగడ్డి దగ్ధమైపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ధాన్యం కుప్పలకు నిప్పు అంటకపోవడంతో నష్టం నుంచి బయటపడ్డామని రైతులు చెప్పారు.

నాలుగు పూరిళ్లు..

సీతంపేట: మండలంలోని కోడిశ పంచాయతీ మల్లమ్మగూడలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షా 50 వేల నష్టం వాటిల్లి ఉంటుందని రెవెన్యూ అధికారుల అంచనా. బిల్లగూడ కాలనీ, బిల్లగూడ, బొర్రవలసకు చెందిన నాలుగు కుటుంబాలు మల్లమ్మగూడ వద్ద పూరిళ్లు కట్టుకుని నివసిస్తూ పరిసరాల్లో కొండపోడు పంటలు పండించుకుంటున్నారు. అందరూ కొండపోడు పనులకు వెళ్లిపోయారు. కాగా దృష్టిలోపం ఉన్న వృద్ధురాలు వంటచేస్తుండగా మంటలు ఎగసి ఇంటికి నిప్పంటుకుంది. దీంతో పక్కనే ఉన్న సవర భారతి, సవర రామన్న, మంగయ్య, ముఖలింగానికి చెందిన ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. బియ్యం 225 కిలోలు కాలిపోయాయి. సవర రామన్నకు చెందిన రూ.30 వేలు, సవర మంగయ్యకు చెందిన రూ.11 వేల నగదు కాలిపోయాయి. అందరికీ సంబంధించిన పసుపు 50 కిలోలు, రాగులు, జొన్నలు 10 కిలోలు, ఇతర నిత్యావసర సరుకులు, వస్త్రాలు కాలిపోవడంతో కట్టుబట్టలతో మిగిలారు. తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తికి సమాచారం అందడంతో వెంటనే వీఆర్‌వో రవికుమార్‌ను సంఘటనా స్థలానికి పంపించి నష్టం అంచనావేయించారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



కాలిపోయిన నగదు పరిశీలిస్తున్న వీఆర్‌వో రవికుమార్ తదితరులు

క్లుప్తంగా

ధాన్యం బస్తాల ధ్వంసం



కిందపడిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో అడవి పందులు ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. గ్రామానికి చెందిన గేదెల చిరంజీవులు 12 బస్తాల ధాన్యాన్ని కల్లంలో ఉంచారు. శనివారం రాత్రి అడవి పందులు చొరబడి ధాన్యాన్ని తిని చిందరవందర చేశాయి. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు.

దంపతుల నిజాయితీ



పెద్దల సమక్షంలో బంగారు హారం అందిస్తున్న పల్ల కరువమ్మ

సారవకోట: మండలంలోని మహాళింగి పంచాయతీకి చెందిన సందపు సుజాత మూడు రోజుల క్రితం తన సోదరుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మూడు తులాల బంగారు హారం పోగొట్టుకుంది. ఆ హారం అదే పంచాయితీ గాతలపేటకు చెందిన పల్ల దాలయ్య, కరువమ్మ దంపతులకు దొరికింది. దీంతో ఆదివారం మహాళింగి వెల్లి జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు ఉరిటి రంజిత్‌కుమార్, గ్రామస్తుల సమక్షంలో సుజాతకు హారం అందజేశారు. దంపతుల నిజాయితీని మెచ్చి సుజాత రూ.10 వేలను బహుమానంగా అందించింది. గ్రామస్తులు కూడా దంపతులను అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోరులో సిక్కోలు హవా



మహిళల కబడ్డీ జట్టుతో సంఘ ప్రతినిధులు, కోచ్ మేనేజర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోరులో శ్రీకాకుళం మహిళల జట్టు సత్తాచాటింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా చోడవరం మండలం అంకుపాలెం వేదికగా ఈ నెల 25 నుంచి 27 వరకు 70వ రాష్ట్ర సీనియర్స్ పురుషులు, మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పురుషుల జట్టు క్వార్టర్‌ఫైనల్స్‌లో ఓటమిపాలవగా మహిళల జట్టు మాత్రం తుది వరకు పోరాడి రన్నరప్‌గా నిలిచి శభాష్ అనిపించింది. తూర్పు గోదావరి జిల్లాతో జరిగిన ఫైనల్స్‌లో 5–3 సెట్ల తేడాతో ఓటమిపాలై రన్నరప్‌గా నిలిచింది. మహిళల కబడ్డీ జట్టు రాణింపు పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకన్న, ఆక్కేని చిరంజీవిరావు, సంఘ ప్రతినిధులు, కోచ్ మేనేజర్లు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు కేంద్రాల్లో జేఈఈ మెయిన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 173 మందికి 171 మంది హాజరయ్యారు. రెండో షిఫ్టులో 173 మందికి 173 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల వేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100 మంది 98 మంది, రెండో షిఫ్టులో 100 మందికి 99 మంది హాజరయ్యారు.

సారా నియంత్రణకు అవగాహన




ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ కృష్ణారావు

కాశీబుగ్గ: కాశీబుగ్గలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు ఆటో డ్రైవర్ల యూనియన్లతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సీఐ కోన కృష్ణారావు మాట్లాడుతూ నాటు సారా కేసుల్లో సగానికి పైగా కేసుల్లో ముద్దాయిలు నాటు సారాని షేర్ ఆటోలతోనే రవాణా చేస్తున్నారని, ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా ప్రయాణికులు నాటు సారాతో ఆటో ఎక్కితే వారిపై ఫిర్యాదు చేయాలని, లేదంటే ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిస్తామని హెచ్చరించారు. ఆటోను కూడా స్వాధీనం చేసుకుంటామన్నారు. నాటు సారా కేసులో నేరం రుజువైతే ఎనిమిదేళ్ల జైలు శిక్ష, మొదటి సారి దొరికితే రూ.రెండు లక్షలు, రెండో సారి దొరికితే రూ.5లక్షలు జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో గొప్పిలి ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కోట ఉమాపతి, మెంబర్ కె.సీతారాం, రెంటికోట ఆటో యూనియన్ ప్రెసిడెంట్ ఆలేటి భీముడు, సెక్రెటరీ పిట్ట శ్రీనివాసరావు, నువ్వులరేవు ఆటో యూనియన్ ప్రెసిడెంట్ జి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వారి ఆభరణాలకు అతుకులు ఉండవు. బంగారంలో కల్తీకి అసలు అంగీకరించరు. స్వచ్ఛమైన మేలిమి బంగారంతోనే నగానట్రా చేయించుకుంటారు. దాని కోసం స్వర్ణకారుల వద్ద స్వయంగా కూర్చుని మరీ తమకు కావలసిన రీతిలో వస్తువులు చేయించుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే పల్లె జీవనంలో ఉండే స్వచ్ఛతే తమ అభరణాల్లోనూ ఉండాలని వారు తపిస్తారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని మారుమూల మత్స్యకార, గిరిజన పల్లెల్లో ఇప్పటికీ ఇటువంటి స్వచ్ఛమైన జీవన సౌందర్యం కనిపిస్తుంది. అక్కడి మహిళల మోముల్లో తొణికిసలాడే అమాయకత్వం.. ఈ ఆభరణాల జిలుగులతో వారి అందాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. పల్లెల్లో నిన్నటి తరం ప్రతినిధులైన అమ్మమ్మలు, నాయనమ్మల్లో చాలా మంది ఇలాంటి ఆభరణాలే ధరిస్తుంటారు. అసలు వీటి ప్రత్యేకతలేమిటి..? మేలిమి బంగారంతో మాత్రమే తయారవ్వడమేమిటి..? అంటే మనం ధరించే బంగారం మేలిమి కాదా.. ప్రస్తుతం వీటిని తయారు చేసే వారు ఎక్కడ ఉన్నారు. ఆ అభరణాల ప్రత్యేకతలేమిటి.. తయారు చేయాలంటే ఎంత చార్జీ చేస్తారు..? వంటి వివరాల సమాహారమే ఈ కథనం.



జీవితమైనా.. నగలైనా.. స్వచ్ఛతే ఆభరణం

- అతుకులు లేని వస్తువులపైనే మోజు
- వాటి తయారీ కూడా కష్టమే
- భిన్నమైన డిజైన్లతో ఆకట్టుకునే రీతిలో..
- పల్లె అందాలకు వింత సోయగం







శ్రీకాకుళం డెస్క్:

చాలా మ్యాగజైన్లు, పత్రికలు.. ఫొటో ఎగ్జిబిషన్లలో గిరిజన, పల్లెకార మహిళల ఫొటోలను ఇట్టే గుర్తుపట్టేస్తాం. కారణం వారి కట్టు..బొట్టు.. ధరించే నగల్లో ప్రత్యేకత. ముక్కు, చెవి, మెడ భాగాల్లో చిత్రమైన ఆకృతులతో కూడిన వారి నగలు మనల్ని ఆకర్షిస్తాయి. అలాంటి ఆభరణాలు ఏ షోరూమ్‌లలో కూడా కనిపించవు. వాటి కోసం ఎవరూ పెద్దగా ప్రచారం కూడా చేయరు. తయారీదారుల వద్ద ఉండే చిన్న చిన్న ఆల్బమ్(క్యాటలాగ్)లలో మాత్రమే ఇవి కనిపిస్తుంటాయి.

అందానికి ఆరు..

గిరిజన, ఇతర పల్లెల్లో ఉండే ముందుతరం వారు ధరించే ఆభరణాలను పరిశీలిస్తే ఆరు రకాలు కనిపిస్తాయి. వాటిలో చెవి భాగంలో ధరించే నాగులు, కొనకమ్ములు, ముక్కుకు ధరించే కమ్ములు, మెడలో ధరించే పుటకల పేట, మామిడి పిందెల పేట, అడ్డికలు స్థానం సంపాదించాయి. వీటినే నాటి తరం వారు అధికంగా తయారు చేయించుకుంటున్నారు. ఈ ఆభరణాల తయారీకి మేలిమి బంగారం అంటే 24 క్యారెట్ల బంగారంతో మాత్రమే వినియోగిస్తారని చెబుతున్నారు స్వర్ణకారులు.

అతుకు లేకుండా.. అందంగా..

- ఈ ఆభరణాలు అతుకులేకుండా తయారు చేయడంలో ప్రతిభ చూపుతారు స్వర్ణకారులు.
- ఈ ఆభరణాల తయారీకి తరుగు అనేది ఉండదు.
- తయారీకి మాత్రం స్వర్ణకారులు రోజుకూలీని చార్జీ చేస్తారు.
- సుమారు రూ.800 నుంచి వెయ్యి వరకు మజూరీగా తీసుకుంటారు.
- ఆభరణాన్ని గిరిజనులు, గ్రామీణ మహిళలు దగ్గరుండే తయారు చేయించుకుంటారు. కొన్ని గంటల వ్యవధిలో సిద్ధం చేసి ఇస్తారు స్వర్ణకారులు.



చూసేందుకు మనం చేతికి ధరించే బ్రాస్‌లెట్ మాదిరిగా ఉంటుంది. దీన్ని అడ్డిక అని పిలుస్తారు. దీని తయారీకి కనీసం 46 గ్రాముల బంగారం అవసరం. దీన్ని మెడలో ధరించడం నాటితరం వారి సంప్రదాయం.

పురాతన పనిముట్లతో..



నాటితరం మహిళలు ధరించే ఆరు రకాల ఆభరణాలు తయారు చేసేందుకు పురాతన పనిముట్లనే వినియోగించాల్సి ఉంటుంది. మేలిమి బంగారంతో చేసే ఈ ఆభరణాలకు అతుకులుండవు. ప్రస్తుతం జనం వాడుతున్న ఆభరణాలతో పోలిస్తే వీటిని తయారు చేయడం కొంచెం కష్టమే. కొద్ది మంది మాత్రమే వీటిని తయారు చేస్తున్నారు.

– మహేష్ కడియం, ఆభరణాల తయారీదారు

శరీరంలో భాగంగా..



మేము ధరించే సంప్రదాయ ఆభరణాలు మా శరీరంలో భాగంగా చూసుకుంటాం. ఒక సారి ధరిస్తే మరమ్మతులకు గురైతే తప్ప వాటి జోలికి వెళ్లం.

– సవర రాజముణి, సాబకోట, మందస

గంటల వ్యవధిలో తయారీ..



మేం ధరించే ఆభరణాలు కేవలం కొద్ది గంటల వ్యవధిలో తయారు చేసి మాకు అందజేస్తారు. ఉదయం వెళితే సాయంత్రానికి సిద్ధం చేసి ఇస్తారు. తరుగు ఉండదు. నేను చాలా ఏళ్ల క్రితం ఆభరణాలు తయారు చేయించుకున్నా.

–సవర సరోజిని, సాబకోట, మందస

24 క్యారెట్ల బంగారం అంటే..

- 100 శాతం స్వచ్ఛత కలిగిన బిస్కెట్ బంగారాన్ని 24 క్యారెట్ల బంగారంగా పిలుస్తారు.
- 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంలో 8శాతం రాగి కలిపితే దాన్ని 22 క్యారెట్ల బంగారంగా వ్యవహరిస్తారు. అలాగే 916 అని కూడా పిలుస్తారు.

22 క్యారెట్ల బంగారం అంటే..

మనం నిత్యం ధరించే గొలుసులు, ఉంగరాలు, హారాలు, ఇతర ఆభరణాలు 22 క్యారెట్ల బంగారంతో తయారు చేస్తారు. 24 క్యారెట్ల బంగారంతో మనం ధరించే వస్తువులు తయారు కావు. ఎందుకంటే మనం ధరించే నగల్ని అతకాల్సి ఉంటుంది. అందులో రంగురాళ్లు, ఇతర అలంకరణ సామగ్రి అమర్చాల్సి ఉంటుంది. అందుకే 22 క్యారెట్ల బంగారం వినియోగిస్తారు.

ఆలయంలో చోరీ



కాటమ్మతల్లి విగ్రహం వద్ద దొంగతనం జరిగిన తీరు పరిశీలిస్తున్నసీఐ శ్రీనివాసరావు, క్రైమ్ టీమ్

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లాలోని కాటమ్మతల్లి ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయ పూజారి జన్ని వెంకటరావు ఆదివారం ఉదయం మూడున్నర గంటలకు ఆలయానికి వచ్చి చూడగా.. ఉత్తర ద్వా రం తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే వెండి ఆభరణాలు కనిపించలేదు. అదే ఆవరణలో ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బంగారు ఆభరణాలు కనిపించడం లేదని ఆలయ పూజారి బూరగాపు వైకుంఠరావు సైతం ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగి ఉంటుందని సీఐ జి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

నేడు గాంధీ మందిరం ప్రథమ వార్షికోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం ప్రథమ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు కమిటీ కన్వీనర్ డాక్టర్ జామి భీమశంకరరావు, ప్రతినిధులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠ్‌కర్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ నిమ్మ వెంకటరావు, శ్రీకాకుళం నగర కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు హాజరుకానున్నారని తెలిపారు.

నువ్వలరేవును నావలరేవుగా తీర్చిదిద్దుతాం



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నువ్వలరేవు గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారని, ఆయన సహకారంతో నువ్వలరేవును నావలరేవుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పశుసంవర్థక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవు గ్రామస్తులు ఆదివారం మంత్రిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. చేపలు వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నామని, నువ్వలరేవు–మంచినీళ్లపేట వద్ద నిర్మిస్తున్న షిప్ ల్యాండింగ్ సెంటర్‌ను ఫిషింగ్ హార్బర్‌గా మార్చి నిర్మాణం చేపట్టాలని కోరారు. గ్రామాన్ని పారిశుద్ధ్య సమస్య వెంటాడుతోందని, పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉందని చెప్పారు. అనంతరం మంత్రి స్పందిస్తూ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బైనపల్లి రఘునాథ్, ఎంపీటీసీ మువ్వల ముకుంద, మాజీ సర్పంచ్ బెహరా ధర్మారావు, మాజీ ఎంపీటీసీ భీమారావు, మత్స్యకార సొసైటీ మాజీ అధ్యక్షుడు మువ్వల మోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు యర్రయ్య, కృష్ణ, దేవా తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సిగడాం జాతరకు వేళాయె..!

- కోర్కెలు తీర్చే కల్పవల్లి మహాలక్ష్మి తల్లి
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు
- నేటి నుంచి ఫిబ్రవరి 1 వరకు యాత్ర



జాతరకు సిద్ధమవుతున్న స్టాల్స్

రణస్థలం: జనజాతరకు వేళయ్యింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరుగాంచిన రణస్థలం మండలం కమ్మసిగడాం పంచాయతీలో వెలసిన మహాలక్ష్మి తల్లి యాత్రకు సర్వం సిద్ధమైంది. లక్షలాది మంది భక్తుల కులదైవంగా విశిష్ట పూజలందుకుంటున్న కమ్మసిగడాం మహాలక్ష్మి తల్లి జాతర సోమవారం నుంచి మూడురోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా రథసప్తమి నాడు పెళ్లి రాటతో మొదలై తొలిరోజు సోమవారం అమ్మవారి కల్యాణం జరగడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం సాంస్కృతిక, పౌరాణిక ప్రదర్శనలు, హ్యాండ్‌లూమ్స్, ఇతర కొనుగోలు సామగ్రితో కూడిన దుకాణాల ఏర్పాటు, ఇతర కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.

శతాబ్దాల చరిత్ర..

1750లో విజయనగరం సంస్థానాన్ని పూసపాటి పెదవిజయరామ గజపతిరాజు పరిపాలిస్తున్న కాలంలో కమ్మదొరలు రాజకీయాలు, ఇతర కార్యక్రమాల్లో కుడిభుజంగా ఉండేవారు. మహారాజు వద్ద పదివేల మందికిపైగా సైన్యం ఉండేది. వారికి బొట్ల గురప్పదొర, వెలిచేటి చినకూర్మరాయులు అధిపతులుగా ఉండేవారు. చాలామంది జమీందారులు సామంతరాజులుగా ఉండేవారు. శ్రీకాకుళాన్ని పాలించే బాదుర్లాఖాన్, అబ్దుల్లాఖాన్ అనే మహమ్మదీయులు కప్పం చెల్లించడం లేదని, వారిని మన అధీనంలోకి తెచ్చుకోవాలనే ఉద్దేశంతో విజయరామరాజు తన సైన్యాధిపతులైన గురప్పదొర, చినకూర్మరాయులును రాయబారులుగా పంపించారు. వారు తిరస్కరించి యుద్ధానికే సన్నద్ధమవ్వమని సందేశం పంపారు. ఈ యుద్ధంలో విజయనగర రాజులు ఓడిపోవడంతో సైన్యాధిపతులు సైతం పలు అవమానాలకు గురయ్యారు. దీనిని భరించలేని గురప్పదొర తన సొంత గ్రామాం సంచాం వెళ్లకుండా ఎలాగైనా మహమ్మదీయులపై గెలుపొందాలని ఆలోచించాడు. ఈ క్రమంలో రణస్థలం మండలం దేవరాపల్లి వద్ద సైన్యానికి ఆరు నెలలు శిక్షణ ఇచ్చి తిరిగి మహమ్మదీయులపై యుద్ధం ప్రకటించి గెలుపొందాడు. ఓటమి బాధతో మహమ్మదీయులు మాటువేసి గురప్పదొరను కత్తితో హతమార్చారు. తన భర్త మరణవార్త విన్న ఇద్దరు భార్యల్లో ఒకరైన మహాలక్ష్మి తన భర్త చితిలోనే సతీసహగమనం చేసుకున్నట్లు పూర్వీకుల కథనం. చితిలో అంతర్థానమైన మహాలక్ష్మికి చెందిన చీరచెంగు, పసుపు, కుంకుమ భరిణులు ఆహుతి కాకుండా మిగిలి ఉండడాన్ని చూసి అక్కడ పెద్దలు అమెను దైవ స్వరూపినిగా కొలుస్తారు. అగ్నికి ఆహుతైన స్థలంలోనే ఆలయాన్ని నిర్మించి ఏటా జాతర నిర్వహించడం ప్రారంభించారు. చీపురుపల్లి మండలం పెదనడిపిల్లి గ్రామానికి చెందిన కన్నవారు చీర, శతమానం, అత్తవారు గ్రామమైన సంచాం నుంచి మేళంతో బంటుపల్లి కుటుంబీకులు పల్లకి మీద వచ్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపిస్తారు. ఏటా రథసప్తమి జరిగిన మూడో రోజున మహాలక్ష్మి తల్లి కల్యాణం ఘనంగా జరిగి జాతర చేస్తుండటం ఇక్కడ అనవాయితీగా వస్తోంది. దీనిని తిలకించేందుకు స్థానికులతో పాటు ఉత్తరాంధ్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు తీర్చుకుంటారు.



మహాలక్ష్మి తల్లి ప్రతిమలు

ఆదిత్యుని సన్నిధిలో మాఘ మాస సందడి



పుష్కరిణి వద్ద క్షీరాన్నం వండుతున్న భక్తులు

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధికి మాఘమాసం రెండో ఆదివారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం రథసప్తమి జరిగిన నేపథ్యంలో బారికేడ్లు ఎక్కడికక్కడే ఉన్నా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ భక్తుల దర్శనాలకు తగిన ఏర్పాట్లు చేశారు. మాఘ మాసం సందర్భంగా భక్తులు పెసలు, గోధుమలు, ఇతరత్రా ప్రసాదాలను ఆదిత్యునికి నివేదించారు. అలాగే మహిళలు ఇంద్ర పుష్కరిణి పరిసరాల్లో పిడకల పొయ్యిపై క్షీరాన్నం వండి ప్రసాదంగా సమర్పించారు. పలువురు భక్తులు తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతరాలయంలో స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేసి దర్శనాలకు అనుమతిచ్చారు. ఆరోగ్యం కోసం సూర్య నమస్కార పూజలను చేయించారు. ఈపీడీసీఎల్ డిస్కం ఫైనా న్స్ డైరెక్టర్ డి.చంద్రం కుటుంబసమేతంగా ఆదిత్యుడిని దర్శించుకున్నారు. ఈయనకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ప్రత్యేక దర్శనం చేయించి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ ఒక్క రోజులో ఆలయానికి రూ.6,07,582 ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలియజేసారు. దర్శన టిక్కెట్లు ద్వారా రూ.2,55,900, విరాళాల ద్వారా రూ.91,682, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.60 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లుగా ఆయన తెలిపారు.

ఆదిత్యుని సన్నిధిలో మంత్రి బొత్స

అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ దంపతులు కుటుంబసమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం వేదపండితులతో ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ అద్భుత ఆరోగ్య క్షేత్రాన్ని దర్శించుకోవడం ఆనందకరమన్నారు. ఆయనతో పాటు మంత్రి కుమారుడు డాక్టర్ బొత్స సందీప్ దంపతులు,కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, డీఆర్వో రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు, బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు అంధవరపు సూరిబాబు, పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, వైఎస్సార్‌సీపీ నేతలు మండవల్లి రవి, ఎంవి.స్వరూప్, నందిగాం ఎంపిపి ఎస్.శ్రీరామమూర్తి, ఆర్డీవో శాంతి, డీఈఓ పగడాలమ్మ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్. జయప్రకాష్ తదితరులు ఉన్నారు.